# వారసత్వం

క్రిష్ణమూర్తికి ఆడవాళ్ళను చూస్తేనే చిరాకు. ఎప్పుడూ ముక్కు మీదే వుండే ఆయన కోపం ఆడవాళ్ళను చూస్తే మరీ ఎక్కువ ముక్కు మీదికి వచ్చి చేరుతుంది. తిట్లు శాపనార్థాలు మొదలు పెడతాడు. ఆడవాళ్ళను చూస్తే క్రిష్ణమూర్తికి చిరాకు! కోపం! - ఎందుకు? అని అడిగితే ఒక్కొక్కరు ఒక్కొక్క కారణం చెప్తారు.

"చిన్ననాటి అనుభవాలు!" అని ఒకరంటారు.

"పాపం! క్రిష్ణమూర్తి!" అన్నట్లుగా ముఖం పెడ్తారు కొందరు.

"దీనికంతా కారణం సవతి తల్లి!" అంటారొకరు.

"సవతి తల్లీ ఏదీ కాదండి! భార్య పోవడం ఇద్దరాడపిల్లలు చిన్నవాడు మగపిల్లాడు ముగ్గుర్నీ పెంచలేక అట్లా అయ్యాడు!" అంటాడు మరొకాయన.

"అయ్యో! అవేవీ కారణాలు కావండీ! ఆయన మేనత్త ఒకావిడ వుండేది! ఆమె గుణాలే అతనికబ్బాయి!" అన్నారొకరు.

అది నిజమేనేమో! అనిపిస్తుంది. వాళ్ళది ఉమ్మడి కుటుంబం. ఆయన మేనత్త చిన్ననాడే ముండమోసి వీళ్ళింట్లోనే వుండేది. ఆమె మొదట్లో ఎట్లా వుండేదో తెలియదు గాని క్రమంగా ఆమె తండ్రి ఆచార సంపదంతా ఆమె కబ్బింది. మడి మట్ట బాగా పాటించేది. దేన్ని చూసినా అంటు! ముట్టు అంటుండేది. దూరమున్న ఆడవాళ్ళ ముఖాన్ని మూడు రోజులు చూసేది కాదు. వాళ్ళ గొంతు ఎక్కడి నుంచయినా ఆమె చెవిలో పడినా మండిపడేది. బాలెంతలక్కూడా ఆమె అండదండలతో ఆంక్షలు బాధలు తప్పేయి కావు.

అదేమిటోగాని వాళ్ళింట్లో మగాళ్ళ జనాభా కన్నా ఆడాళ్ళ జనాభా ఎక్కువ. వచ్చేపోయే ఆడపడుచులకేం కొదువలేదు. పెళ్ళిళ్ళనీ పండుగలనీ పబ్బాలనీ కడుపులనీ నీళ్ళాటలనీ -

ఏదో ఒక కారణంతో వాళ్ళు రావడం తరుచుగానే జరుగుతుండేది. అంతెందుకు వాళ్ళింట్లో నీళ్ళాటకని ఒక గదే వుండేది. ఆ గదెప్పుడూ ఖాళీగా ఉండేది కాదు. ప్రతినెల ఓరకున్న ఆడవాళ్ళు కూర్చోడానికి ఇంటి వెనుకాల ఇంటికి దూరంగా ఓ చీకటి అర్ర ఉండేది. ఆ మూడు రోజులు ఆడవాళ్ళకు స్నానం లేదు. చీరమార్చడం లేదు. మనిషి ముఖమే కనిపించక ఆ మూడు రోజులూ గడిపేవాళ్ళు. స్నానం చేసి ఇంట్లోకి వచ్చినా వాళ్ళను ఐదు రోజుల వరకూ ఇంట్లో దేన్నీ ముట్టుకోనిచ్చేది కాదు ఆవిడ! ఆమెకు ప్రతి ఆడది అపవిత్రతకు ఆలవాలంగా కన్పించేది. వాళ్ళను చూస్తేనే పళ్ళు నూరేది. ఆమె పళ్ళు నూరితే కిర్రుకిర్రుమని శబ్దం చుట్టుపక్కల వాళ్ళందరికీ వినిపించేది.

ఆడాళ్ళవరైనా పొద్దున్నే లేచి వంటింటివైపు వెళ్తున్నట్లు కన్పిస్తే ఆమె "స్నానం చేసావా?" అని అడిగేది.

"స్నానం చేసాను పెద్దమ్మా!" అంటే అనుమానంగా చూసేది.

చేయలేదంటే పళ్ళు పటపట కొరుకుతు తిట్ల వర్షం కురిపించేది.

ఆడవాళ్ళెవరైనా మంచి బట్టలు వేసుకున్నా పూలు అవీ పెట్టుకొని చక్కగా తయార యినా ఆమె చిరాకుకు అంతముండేది కాదు.

"సాని ముండల్లా తయారయ్యారు! ఏమిటో ఈ కొంప చివరకు ఏమౌతుందో? నేను పోయాక" అని కోపంతో చింతను ప్రకటించేది.

ఆ మేనత్త పెంపకంలోనే పెరిగాడు క్రిష్ణమూర్తి. అతడు పుట్టగానే తల్లి పురిట్లో చని పోయింది. అతనితండ్రి భార్య చనిపోయిన నెలరోజులకే మళ్ళీ పెళ్ళి చేసుకున్నాడు పిల్లాడి కోసం. కాని ఆ పిల్లాడిని ఆమె పెంచలేదు. మేనత్తే దగ్గరికి తీసి పెంచింది. ఆమె పెంపకంలో క్రిష్ణమూర్తికి ఆమె బుద్ధులే వచ్చాయని అంటారు. మొత్తం మీద ఆయన అట్లా కావడానికి కారణం పెంపకమో అనువంశికమో చెప్పలేము.

క్రిష్ణమూర్తికి పెళ్ళయింది. ఆమెతో అనుబంధం అతనికి అంతంతమాత్రమే. ఆమె ఇంటి గడప దాటేది కాదు. లేదా దాటనిచ్చేవారు కాదు. ఆయన వ్యవసాయం చేయిస్తూ ఎక్కువగా బయటనే వుండేవాడు. పగటిపూట వాళ్ళిద్దరు కలుసుకునే అవకాశమే వుండేది కాదు. ఎప్పుడైనా ఆయన పగటిపూట ఇంటికి వచ్చినా గబగబ భోంచేసి వెళ్ళిపోయేవాడు. అతని మేనత్త అతని భార్యను పగటిపూట అతని ఎదుటపడకుండా చూసేది. క్రమంగా మేనత్త పోయింతర్వాత కూడా ఆంక్షలు పెట్టేవాళ్ళు ఎవరూ లేకపోయినా ఆమెకదే అలవాట యింది. ఆమె భర్త రాత్రయ్యాక భోజనాలయ్యాక వాళ్ళ గదికి వచ్చేవాడు. గుడ్డి దీపపు వెలుగులోనో చీకట్లోనో వాళ్ళు కలుసుకునేవారు. అట్లా కలుసుకున్నప్పుడు ఇద్దరికీ మాట్లాడు కునేది ఏమీ దొరికేది కాదు.

క్రిష్ణమూర్తికి ఇద్దరు కూతుళ్ళు ఒక కొడుకు పుట్టిం తర్వాత భార్య హఠాత్తుగా ఏమయిందో ఎవరికీ తెలియదు - ఈ లోకం విడిచిపెట్టి వెళ్ళిపోయింది. భార్య పోయిందని క్రిష్ణమూర్తికి పెద్ద దిగులు కలగలేదు. ఎప్పటిలాగానే ఆయన జీవితం గడిచింది. ఒక్కటే భేదమేమిటంటే గదిలో రాత్రి పూట భార్య అనే మనిషి వుండేది కాదు అంతే! అది ఉమ్మడి కుటుంబం కాబట్టి ముగ్గురు పిల్లల పెంపకం ఏదో విధంగా జరిగిపోయింది. పిల్లలు పెరిగారు కాని వాళ్ళకు ఎవరి ప్రేమ అప్యాయతలు దొరకలేదు.

కాస్త పిల్లలు పెద్దవాళ్ళయ్యాక క్రిష్ణమూర్తి అన్నదమ్ములు విడిపోయి వేరే కాపురాలు పెట్టారు. క్రిష్ణమూర్తి కొడుకు పై చదువు కోసమని పట్నం వెళ్ళిపోయాడు. హాస్టల్లో చేరాడు. ఇంటికి చాలా తక్కువగానే వచ్చేవాడు. క్రిష్ణమూర్తి ఇద్దరు కూతుళ్ళతో - తన పాలుకు పెద్దల ఇల్లు లంకంతది వచ్చింది - ఆ ఇంట్లోనే వుంటున్నాడు.

క్రిష్ణమూర్తి ఎప్పటిలాగానే వ్యవసాయం పనుల్లో బయటే ఎక్కువగా వుంటాడు. ఇద్దరు కూతుళ్ళే ఇల్లంతా చక్కబెట్టడం నేర్చుకొన్నారు. వంట నేర్చుకున్నారు. వాళ్ళిద్దరూ లంగా ఓణీల నుంచి చీరలు కట్టేవాళ్ళయ్యారు. అయినా క్రిష్ణమూర్తి మనస్సులోకి వాళ్ళిద్దరికి పెళ్ళి చెయ్యాలనే ఆలోచన ఎన్నడూ రాలేదు. కాని వాళ్ళను చూస్తే మండిపడేవాడు. పళ్ళు పటపట కొరుకుతూ తిట్లకు దిగేవాడు. అందుకే ఆ పిల్లలు తండ్రి ఎదుటపడేవారే కాదు. తండ్రి ఇంట్లో వున్నప్పుడు వాళ్ళు వంటింట్లోనే వుండేవాళ్ళు. వాళ్ళది లంకంత ఇల్లు కాబట్టి తండ్రి ఎదుటపడే అవకాశం లేకుండానే వాళ్ళకు రోజులు గడిచిపోతున్నాయి. తండ్రికి భోజనానికి అన్నీ వంటింటి పక్క వసారాలో అమర్చిపెట్టి వాళ్ళు మాత్రం వంటింట్లో దూరేవాళ్ళు. తండ్రి కోపం తిట్లకు భయపడి అతని ఎదుటకే రావడం మానేసారు. క్రిష్ణమూర్తి కూడా మారు అవసరమున్నా అడుగకుండానే భోంచేసి వెళ్ళి పోయేవాడు. అతడు కూతుళ్ళతో మాట్లాడగా ఎవరూ చూడలేదు.

క్రిష్ణమూర్తి పెద్ద కూతురు కౌసల్య తల్లిలాగా అందగత్తె, నెమ్మదస్తురాలు. చిన్న కూతురు లీల చాలా చలాకీపిల్ల. చలాకీతనమే ఆమెకు అందాన్ని తెచ్చి పెట్టింది. కొడుకు రామమూర్తి చదువయ్యాక పట్నంలోనే ఉద్యోగం చూసుకున్నాడు. విద్యార్థి దశలోనైనా ఎండాకాలం సెలవులకు వచ్చేవాడు. ఇప్పుడు ఇంటికి రావడం పూర్తిగా మానేసాడు.

క్రిష్ణమూర్తి ఎదిగిన కూతుళ్ళను గురించి అతనికంటే ఆ ఊరివాళ్ళకు ఎక్కువ విచారంగా వుంది.

"ఆడపిల్లలు! వాళ్ళకి పెళ్ళీడు దాటిపోయింది. పెళ్ళి చెయ్యాలనే ఆలోచన లేదా?" అడిగారు క్రిష్ణమూర్తిని ఆఖరికి ఊరివాళ్ళు కొందరు.

క్రిష్ణమూర్తి వాళ్ళు అడిగినందుకు భగ్గుమని మండిపడ్డాడు. వాళ్ళకేం జవాబు

చెప్పకుండానే ముందుకు వెళ్ళాడు.

"దొంగముండా కొడుకులు! వీళ్ళకెందుకట వాళ్ళకు పెళ్ళి చెయ్యాలని చింత!" అని పళ్ళు పటపట కొరికాడు.

క్రిష్ణమూర్తి వున్నవాడే అని కట్నానికి ఏం కొదువ వుండదని చివరకు తెగించి కొందరు మగపెళ్ళివారే వచ్చారు కౌసల్యను చేసుకుంటామని. క్రిష్ణమూర్తి ఏం జవాబు చెప్పకపోయేసరికి అడిగేవాళ్ళు నోరు మూసుకున్నారు. మళ్ళీ ఎవరూ ముందుకు రాలేదు. "వెధవ ముండా కొడుకులు ఆస్తి మీద కన్నేసి వచ్చారు!" అని భగ్గుమన్నాడు క్రిష్ణమూర్తి.

ఇదంతా చూసి కౌసల్య కుమిలికుమిలి ఏడ్చింది. కాని ఇదంతా చూసిన లీల కౌసల్య లాగా ఏడ్వలేదు. ఎదురు తిరిగింది.

క్రిష్ణమూర్తి ఒక చెల్లెలికి ఊళ్ళో సంబంధమే చేశారు. మొదట్లో వాళ్ళు బాగా వున్నవాళ్ళే. వీళ్ళతో సరితూగేవాళ్ళే. కాని కుటుంబం పెద్దది కావడంతో పెళ్ళిళ్ళు పెట్టిపోతలతో పంటలు బాగా పండక భూములన్నీ అమ్ముకునే పరిస్థితి ఏర్పడి బీదవాళ్ళయ్యారు. క్రిష్ణమూర్తి చెల్లెలు అనంతమ్మ భర్త పోయింతర్వాత మిగిలిన రెండు ఎకరాల భూమిని వ్యవసాయం చేయించు కుంటూ ఒకే ఒక్క కొడుకు జగపతితో వుంటున్నది.

లీల ఎట్లా ఏం చేసిందో జగపతిని కలుసుకుంది. అతన్ని ఒప్పించి అతనితో లేచి పోయింది. జగపతితో వచ్చిన లీలను అనంతమ్మ ఆదరించింది. ఇద్దరికీ తిరుపతి తీసికెళ్ళి పెళ్ళి చేసింది. ఇంటికి తీసుకవచ్చి నలుగుర్ని పిలిచి భోజనాలు పెట్టింది. లీల చేసిన పనిని ఎవరూ నిందించలేదు. పైగా క్రిష్ణమూర్తి దగ్గరికి వెళ్ళి -

"ఏమయ్యా! క్రిష్ణమూర్తి! నీకు ఈడయితే వచ్చింది. కాని బుద్ధి రాలేదు. లీల వెళ్ళి మేనత్త కొడుకునే పెళ్ళి చేసుకుంది. ఎవరో పరాయివాడిని కాదు. కూతురు అల్లుడ్ని ఇంటికి పిల్చి చీరలు సారెలు పెట్టి గౌరవించవయ్యా!" అని ఈసారి ధైర్యంగానే చెప్పారు.

"ఏం పెద్దమనుషులయ్యా మీరు! నేను చేయవలసిన పెళ్ళి అది చేసుకుంది. దాని పెళ్ళి దాని ఇష్టంతో అయింది. నేను దాని ముఖం చూడను ఇక! మీరంతా ఇక్కడి నుంచి వెళ్ళిపొండి!" అని మండిపడ్డాడు క్రిష్ణమూర్తి. అతని కాఠిన్యానికి ఆశ్చర్యపోయారు వచ్చిన పెద్ద మనుషులు.

చెల్లెలు లీల వెళ్ళిపోయింతర్వాత కౌసల్య ఒంటరిదైపోయింది. ఆ పెద్ద ఇంట్లో ఒక్కతె ఆమె బందీలాగ అయిపోయింది. ఆమెకూపిరాడలేదు. పరిస్థితులు మునుపటిలాగానే లీల వున్నప్పటిలాగానే వున్నాయి. కాని అప్పుడు చలాకీగా ఉండే లీల తోడుగా వుండేది. అప్పుడింత కష్టమనిపించలేదు. తమ్ముడు రావడం బొత్తిగా మానేసాడు. వాడు తండ్రి వున్నంత వరకు రాడేమో! "వాడిదేం మౌనయుద్ధమో!" నిట్టూర్చింది కౌసల్య.

"అనంతమ్మత్తకు ఎక్కువ భూమి లేదు. లీల ఆవిడ కోడలైంది. ఇంత భూమి అయినా తండ్రి లీల పేర వ్రాసెయ్యవచ్చు గదా! అనంతమ్మత్త ఆయన చెల్లెలే ! పరాయిది కూడా కాదు! నాన్న కెందుకింత కోపం - కాఠిన్యం!" అర్థం కాలేదు కౌసల్యకు. ఆలోచిస్తుంటే ఆ ఇంట్లో జెయిల్లో వున్నట్లుగా అనుభవం కలిగిందామెకు.

ఆ ఊపిరాడని పరిస్థితుల్లో పాలేరు వెంకట్రావు చూపిన సానుభూతి కౌసల్యకు చాలా ఊరట కలిగించింది. ఆమెకతడు పెద్ద అండలా కన్పించాడు. వెంకట్రావు చూపిన సానుభూతి వల్ల కౌసల్యలో అతడంటే ఆకర్షణ, ఆప్యాయతలు కలిగాయి.

ఒకరోజు రాత్రి కౌసల్య వెంకట్రావుతో పట్నం లేచిపోయింది.

"ఆడముండలు! చివరకు ఈ వంశానికి అప్రతిష్ఠ తెచ్చే వెళ్ళిపోయారు!" అని పళ్ళు కొరికాడు క్రిష్ణమూర్తి.

కొన్నాళ్ళకే క్రిష్ణమూర్తి హఠాత్తుగా గుండెనొప్పితో చనిపోయాడు.

తండ్రి మరణవార్త విని రామమూర్తి ఊరికి వచ్చాడు. తండ్రికి కొరవి పెట్టాడు.

"ఎట్లా అయితేనేం కొడుకు కొరవి పెట్టాడు. మంచి చావే చచ్చాడు క్రిష్ణమూర్తి" అనుకున్నారు ఊళ్ళో ప్రజలు.

తరతరాల నుంచి వస్తున్న భూమికి ఇల్లుకు రామమూర్తే వారసుడయ్యాడు.

పున్నామ నరకం నుంచి తప్పించేవాడు కొడుకు! చస్తే కొరవి పెట్టేవాడు కొడుకు! ఆ కొడుకే వారసుడయ్యాడు క్రిష్ణమూర్తి ఆస్తికి. రామమూర్తి తర్వాత ఒక ఇంటివాడై వంశాన్ని నడిపాడు.

ఇద్దరు చెల్లెళ్ళు ఇంటికి అప్రతిష్ఠ తెచ్చారని రోజుకు ఒక్కసారైన జ్ఞాపకం చేస్తాడు ఆస్తికి వారసుడైన రామమూర్తి.

* * *